


మన్యంలో మండుతున్న ఎండలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మన్యంలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోంది. బుధవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మార్చి చివరి వారంలోని ఎండలు మండిపోతుంటే.. ఏప్రిల్, మే నెలలో ఇంకే విధంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఎండల ప్రభావంతో ఉపాధి హామీ వేతనదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో పనిచేసే కార్మికులు, రైతులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉపాధి పనుల వద్ద టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

విజయనగరంలో పోటాపోటీ

- నగర అభివృద్ధిపై కోలగట్ల ధీమా
- ప్రభుత్వంపై వ్యతిరేకతే గెలిపిస్తుందంటున్న అదితి





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం రాజకీయాలు ఆసక్తికరంగానూ, రసవత్తరంగాను సాగుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య రాజకీయం హోరాహోరీగా సాగుతోంది. దీంతో, ఈ అసెంబ్లీ స్థానంలో ప్రస్తుతం వైసిపి, టిడిపి మధ్య పోటాపోటీ పరిస్థితులు నెలకొన్నాయి. విజయనగరం నగర పాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ఈ ఎన్నికల్లో జనసేన అదనంగా తోడైందని, వీటితోపాటు ఎమ్మెల్యే కోలగట్ల ఏకపక్ష వైఖరి కూడా తనకు కలిసి వస్తుందని టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు చెబుతున్నారు. కొద్దిరోజులుగా ఇరు పార్టీల అభ్యర్థులూ ప్రచారంలో దూకుడు పెంచారు. కోలగట్ల సుమారు ఆరు నెలలుగా చాపకింద నీరులా అన్ని సామాజికవర్గాలు, ప్రాంతాలు, ఉద్యోగ, వ్యాపార సంఘాలతో మమేకమై ఎన్నికల వ్యూహానికి పదును పెట్టారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో వున్నారు. కోలగట్ల చెబుతున్నట్టు నగరంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన మాట వాస్తవమే. ముఖ్యంగా నగరంలో రోడ్ల విస్తరణ గడిచిన ఐదేళ్ల మునుపెన్నడూ లేనంతగానే చేపట్టారు. పార్కులూ, సెంటర్ లైటింగ్, ముఖ్యమైన కూడళ్లలో ఆకర్షనీయమైన విగ్రహాలు ఏర్పాటు చేశారు. గతంతో పోలిస్తే నగరంలోని ఇదో మైలు రాయి అనే మాట వినిపిస్తోంది. ఇవన్నీ కోలగట్లకు కలిసొచ్చే అంశాలేనని పలువురు విశ్లేస్తున్నారు. కానీ, అభివృద్ధి అంటే రోడ్లు, పార్కులు, లైటింగ్ వంటివేనా? ఉపాధి అవకాశాలు ఏమైనా పెంచారా? కనీసం ఉన్న ఉపాధి అవకాశాలనైనా నిలబెట్టారా? జ్యూట్ మిల్లుల మూతకు కారకులెవరు? ఆయా స్థలాలను వసరపర్చుకున్నదెవరు? అంటూ టిడిపి అభ్యర్థితోపాటు ఆమె మద్దతుదారులు ప్రశ్నిస్తూ ప్రచారం చేస్తున్నారు. నగర అభివృద్ధిలో ప్రత్యేకించి కోలగట్ల చేసింది ఏముంది? అని కూడా వైసిపికి కౌంటర్ ప్రచారం చేస్తున్నారు. సొమ్ముకరిదీ సోకొకరిది అన్నట్టుగా నగరపాలక సంస్థ సొమ్ముతో చేపట్టిన పనులను కోలగట్ల తన గణకార్యంగా చెప్పుకుంటున్నారనే విమర్శలు కూడా తెలుగు తమ్ముళ్ల నుంచి వ్యక్తమౌతున్నాయి. నగరపాలక సంస్థలో మితిమీరిన జోక్యంతో పెత్తనం చలాయించి ఈ పనులన్నీ చేశారని, చివరకు సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లకు సైతం స్వేచ్ఛలేకుండా చేశారని కూడా ప్రచారం చేస్తున్నారు. ఆయన చేసిందంటూ లేక కార్పొరేషన్ తరపున చేసినవన్నీ గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అదితి తండ్రి అశోక్ గజపతిరాజు రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా పనిచేసినా నగరానికి ఒరింగిందేమీ లేదని, అసలు ప్రజల సమస్యలే పట్టించుకోలేదని, అందువల్లే చారిత్రక విజయనగరం చాలా వెనుకబడిందని కోలగట్ల, ఆనుయాయులు చెబుతున్నారు. నగరం అభివృద్ధి జరిగిందంటే తాను ఎమ్మెల్యేగా, తన కుటుంబ సభ్యులు కార్పొరేషన్‌లో అడుగుపెట్టాకే జరిగిందని కోలగట్ల వాదన వినిపిస్తోంది. మాన్సాస్ భూములు, ఆస్తులు రాజులే కొల్లగొట్టారని వైసిపి నాయులు చెబుతుండగా, స్వామి ఎమ్మెల్యే అయ్యాయక నగరంలో దందాలు పెరిగిపోయంటూ టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. తాము నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పేదలకు పంపిణీ చేయలేదని టిడిపి, తమ హయాంలో వేలాది మందికి సొంత స్థలాలు, ఇళ్లు మంజూరు సాధ్యమైందని వైసిపి కేడర్ చెబుతోంది. ఇలా ప్రచారంలోనూ ఒకొరికొకరు ధీటుగానే దూసుకెళ్తున్నారు. గతంతో పోలిస్తే టిడిపి అభ్యర్థి తరపు ప్రచారం భిన్నంగా ఉంది. రెండు నెలల ముందు నుంచే ఇంటింటికి వెళ్లడంతోపాటు వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలతో అదితి గజపతి మమేకమౌతున్నారు. క్షేత్ర స్థాయి కేడర్‌తో కమ్యూనికేషన్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వైసిపి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారేదీమా వ్యక్తం చేస్తున్నారు.

- నారా లోకేష్‌తో చర్చలు విఫలం
- ఇండిపెండెంట్‌గా గొంప కృష్ణ పోటీకి సిద్ధం
- ఎస్.కోట, కొత్తవలసలో భారీ సభలకు సన్నాహాలు



తగ్గేదే లే

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

చివరి వరకు టిక్కెట్ ఇస్తామని చెప్పిన పార్టీ అధిష్టానం తనకు వెన్నుపోటు పొడవడాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు ఎమ్మెల్యే టిక్కెట్టు తనకే కేటా ఇస్తామని, నియోజకవర్గంలోకి వెళ్లి సంబరాల ఏర్పాట్లలో ఉండాలని తనను పంపించేసి వెంటనే కోళ్ల లలిత కుమారికి ఉమ్మడి అభ్యర్థిగా టికెట్‌ను ప్రకటించడంతో పార్టీ నాయకత్వంపై గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గొంప కృష్ణ తనకు మద్దతుగా ఉన్న నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో నియోజకవర్గ ప్రజలతో గత ఆదివారం పట్టణంలోని విశాఖ అరకు రహదారిలో భారీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు తాను ఇండిపెండెంట్‌గా నైనా పోటీ చేసి తీరుతారని ప్రకటించారు. ఈనేపథ్యంలో పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు గొంప కృష్ణకు ఫోన్ చేసి విజయవాడ వచ్చి తనను కలవాలని ఆదేశించారు. గొంప కృష్ణ చంద్రబాబును కలవటానికి సమ్మతించకపోవడంతో సోమవారం యార్లగడ్డ మురళీకృష్ణ ఎస్.కోట వచ్చి గొంప కృష్ణతోను, ఆ గ్రూపు నాయకులతోను మాట్లాడారు. బి- ఫామ్ ఇచ్చేవరకు టిక్కెట్టు ప్రకటన శాశ్వతం కాదని, రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తాననడం సరికాదని, చివరి వరకు వేచి చూడాలని లేకుంటే సరైన నామినేటెడ్ పదవితో పార్టీలో ఉన్నత స్థానం కల్పిస్తారని తెలిపారు. అయినా గొంపకృష్ణ గ్రూపు నాయకులు ససేమిరా అనడంతో ఆ విషయాన్ని నారా లోకేష్ నారా లోకేష్‌కు మురళీకృష్ణ తెలిపారు. దీంతో లోకేష్ గొంపకృష్ణకు ఫోన్ చేసి తనను కలవాలని చెప్పడంతో కృష్ణతో పాటు గొంప వెంకటరావు, గొరపల్లి రాము, పైడి బాబు, రాయవరపు చంద్రశేఖర్ తదితరులు బుధవారం విజయవాడ వెళ్లారు. కృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని, మిగతానాయకులకు కూడా నామినేటెడ్ పదవులు ఇస్తామని, ఈ సారికి కోళ్ల లలిత కుమారిని గెలిపించాలని లోకేష్ కోరారు. గొంపకృష్ణ స్పందిస్తూ గతంలో విశాఖపట్నంలో అచ్చెంనాయుడు, బుద్ధ వెంకన్న సమక్షంలో చర్చలు జరిగినప్పుడు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని చెప్పారని, లలిత కుమారి, రాంప్రసాద్ అంగీకరించక పోయినప్పటికీ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇస్తామని, నియోజకవర్గంలో కార్యక్రమాలు చేసుకోవాలని చెప్పారని గుర్తు చేశారు. తమకు ఎమ్మెల్సీ వద్దని, ఇండిపెండెంట్‌గా పోటీ చేసి, గెలిచి మళ్లీ వస్తామంటూ అక్కడి నుంచి వచ్చేశారు. ఎస్.కోట, కొత్తవలసలో భారీ సభలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్.కోటలో టిడిపి రాజకీయాలు ఉత్కంఠగా మారాయి.

నాడు శత్రువులు.. నేడు మిత్రులు



కొత్తపల్లి గీత



గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది ఒక నానుడి. అది అక్షరాలా నిజమని తేలింది. ఒకసారి ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేసిన నాయకులు తర్వాత ఎన్నికల్లో ఒకే పార్టీలో కలిసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పుడదే జరుగబోతోంది. 2014 ఎన్నికల్లో అరకు ఎంపి అభ్యర్థులుగా వైసిపి నుంచి కొత్తపల్లి గీత, టిడిపి తరపున గుమ్మడి సంధ్యారాణి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గీత విజయం సాధించారు. తర్వాత కొత్తపల్లి గీత ఎస్‌టి కాదని సంధ్యారాణి కేసు వేశారు. వైసిపి ఎంపిగా విజయం సాధించిన తర్వాత కొన్నాళ్లకు గీత అధికారంలోకి వచ్చిన టిడిపికి అనుకూలంగా పని చేయడం ప్రారంభించారు. ఆ పరిస్థితుల్లో గీతపై వేసిన కేసుని సంధ్యారాణి ఉపసంహరించుకున్నారు.

పదేళ్ల తర్వాత మళ్లీ ఇద్దరూ కలిసి పని చేయాల్సిన సందర్భం వచ్చింది. అప్పుడు ప్రత్యర్థులుగా పోటీ పడిన గీత, సంధ్యారాణి ఇప్పుడు మిత్రులుగా కలిసి పని చేయాల్సిన అవసరం ఏర్పడింది. టిడిపి, జనసేన, బిజెపితో పొత్తులో భాగంగా నియోజకవర్గంలో బిజెపి ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీత గెలుపు కోసం టిడిపి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి పని చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల బిజెపి అరకు ఎంపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతని ఖరారు చేసింది. మరోవైపు పదేళ్ల నాటి శత్రుత్వం ఇప్పుడు కూడా వారిద్దరి మధ్య ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. గీతపై కుల వివాదం వెంటాడుతున్నా బిజెపి ఆమె పేరునే ప్రకటించింది. గీతని ఎంపి అభ్యర్థి చేయొద్దని టిడిపి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో గీత విజయం కోసం సంధ్యారాణి ఏమేరకు కృషి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కౌంటింగ్ కేంద్రంలో

పక్కాగా ఏర్పాట్లు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కల్పించాల్సిన వసతులు పక్కాగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలోని ఉద్యాన కళాశాలలో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒలతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా ఉద్యాన కళాశాల మొదటి, రెండో అంతస్తు భవనాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముగిసిన అనంతరం ప్రతీ నియోజకవర్గ ఇవిఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన భవనం వద్ద రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇవిఎంలు తీసుకున్న తరువాత స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రిసెప్షన్ సెంటర్ వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటుచేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఎం.వి.జి.కృష్ణాజీ, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనాకుమారి, విష్ణు చరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, వి.వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఉల్లిభద్రలోని కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర ఉన్నతాధికారులు

ముగిసిన టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం పదో తరగతి ప్రధాన పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు డిఇఒ పగడాలమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో బుధవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 10686 మంది హాజరు కావాల్సి ఉండగా 10578 మంది హాజరయ్యారని తెలిపారు. 108 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ఆరు కేంద్రాలను డిఇఒ తనిఖీ చేశారు. 19 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు పరిశీలించాయి. ఈ నెల 30 వరకు సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు కొన్ని కేంద్రాల్లో జరగనున్నట్లు డిఇఒ తెలిపారు.

సీతానగరం : మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ సూరిదేముడు తెలిపారు.

వీరఘట్టం : మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ డి.గౌరునాయుడు తెలిపారు. వీరఘట్టం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల నుంచి 9, బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో ఊటబావులు, చెరువులు, బావులు అడుగంటి పోయాయని చెప్పారు. తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు అధికారులతో ఆయన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు ఇప్పటినుండే సిద్ధం కావాలన్నారు. ముందుగా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్ల ప్రకారం విభజించి ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు. అక్కడ అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించేందుకు వచ్చిన కేంద్ర పోలీస్ దళాలతో ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్, తదితర విధులు ఎన్నికలు పూర్తయ్యే వరకు నిర్వహించాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను విరివిగా సందర్శించాలని ఆదేశించారు. ప్రత్యేక నిఘా పెడుతూ ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని ఆదేశించారు. గతంలో ఎన్నికల్లో నమోదైన కేసుల్లో వారిపై తీసుకున్న చర్యల గురించి ముందుగా సమాచారాన్ని సేకరించాలన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి సునీల్ షరోన్, డిఎస్‌పిలు ఎస్.ఆర్.హర్షిత, జి.వి.కృష్ణారావు, జి.మురళీధర్, వెంకట అప్పారావు, ఎస్.ఎండి.అజీజ్, సిఐలు సిఎచ్.లక్ష్మణరావు, బి.ఎం.డి.ప్రసాద్‌రావు, ఎఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్



జీడి పంటలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరరావు, తదితరులు

జీడికి రూ.16 వేలు మద్దతుధర కల్పించాలి

ప్రజాశక్తి-కురుపాం

జీడిపిక్కలకు క్వింటాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలో ఉరిడి, ఉదయపురం, మొండెంఖల్, గుజ్జువాయి తిత్తిరి, పెద్దగొత్తిలి, మరిపల్లి పంచాయతీల్లోని గిరిజన గ్రామాలను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డక తిమోతి, బిడ్డిక అనిల్ కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్లుగా జీడికి గిట్టుబాటు లేక, పంట దిగుబడి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులు.. దళారుల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

తిత్లీ తుపాను వల్ల నేటి వరకు సరిగా పంట లేక బతుకుతెరువు కోసం ఏజెన్సీ ప్రాంతంలో వలసలు పోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆరిక సంతోష్, బి.రాధమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది తప్పుడు ప్రచారం

సిపిఎం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైసిపి తప్పుడు ప్రచారం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు హితవుపలికారు. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సిపిఎం నుంచి వైసిపిలో పలువురు కార్యకర్తలు చేరారని సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండించారు. ఎక్కడెక్కడో ఉన్న వైసిపి కార్యకర్తలను తీసుకొచ్చి తిరిగి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. నిజంగా సిపిఎం కార్యకర్తలు, నాయకులు వైసిపిలో చేరితే నిర్దిష్టంగా, బహిరంగంగా సమావేశాలు పెట్టి చూపించి ప్రకటన చేయాలని సవాల్‌చేశారు. అంతేతప్ప ఇటువంటి తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఒక విధంగా చెప్పాలంటే సిపిఎంని చూసి వైసిపి భయపడుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈసారి ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి పోటీలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, బిడ్డిక శంకరరావు పాల్గొన్నారు.

జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా భద్రగిరి గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల జూనియర్ కళాశాల, ఎపి గిరిజన గురుకుల (పిటిజి) బాలికల పాఠశాల విద్యార్థుల్లో కొందరిని జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా గుర్తించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు రెడ్ క్రాస్ సభ్యునిగా ఐడి కార్డుతోపాటు సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. వీరికి ఫస్ట్ ఎయిడ్, ప్రకతి విపత్తుల సందర్భంగా తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి సహకరించిన భద్రగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్‌కు రెడ్‌క్రాస్ తరపున అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పైడా కొండలరావు, రెడ్ క్రాస్ సభ్యులు గుడ్ల హరిప్రసాద్, బేతా కుమార్ పాల్గొన్నారు.

జిసిసి గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ గోదాములను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శివప్రసాద్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఎన్నికల నిబంధనల కారణంగా గోధుమపిండి, బియ్యం తదితర ప్యాకెట్లపై ప్రభుత్వ ప్రచార లోగోలపై స్టిక్కర్లు అంటించింది, లేనిది పరిశీలించారు. అనంతరం స్టాక్ బ్యాలెన్స్ రికార్డులను సరి చూశారు. గోదాంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. ఐసిడిఎస్ కేంద్రాలకు ప్రభుత్వ అందజేస్తున్న మూడు కేజీల బియ్యం ప్యాకెట్లను కూడా పరిశీలించారు. ఆయన వెంట జిసిసి గోదాం ఇన్‌ఛార్జి సాంబశివరావు ఉన్నారు.



గోదాంలో స్టాక్ నిల్వ పరిశీలిస్తున్న పౌరసరఫరాల అధికారులు

ఇవిఎంలపై శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగంపేట స్కూల్లో ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం ఇవిఎంపై పిఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటర్లకు ఓటు వేయడంపై అవగాహన కలిగించాలన్నారు. ఇప్పటికే ఇవిఎం ద్వారా ఆయా గ్రామాలలో ఓటర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వి.రమణ, ఉపాధ్యాయులు నల్ల బాలకృష్ణ, పెంటా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రెండో రోజు వర్క్‌షాప్ కొనసాగింది. వర్క్‌షాప్‌లో 45 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇవిఎంలు వినియోగించే విధానం, ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.వి.జనార్ధన్, ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎంఇఒలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీలు ఎం.పైడపు నాయుడు, గుల్ల రామారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ హితం కోసం యువత పనిచేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువత చదువుపైనే కాకుండా సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని, తద్వారా సమాజ హితమైన కార్యక్రమాలు చేపట్టాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని తెలిపారు.ప్రపంచ సోషల్ వర్క్‌డే సందర్భంగా బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'సోషల్ వర్క్ - ట్రాన్సఫార్మేషన్ అఫ్ ట్రైబల్ డెవలప్మెంట్' అనే అంశంపై జరిగిన సెమినార్‌కు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గిరిజనుల జీవితం చాలా స్వచ్ఛమైనదని, వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధి వైపు వారిని నడిపించాల్సిన బాధ్యత సోషల్ వర్క్ విద్యార్థులకు ఉందని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ అఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపిన్ జోజో మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల అధ్యయనంవల్ల యువతలో సమాజంపై స్పందించే తత్త్వం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన విశ్వ విద్యాలయం లో గిరిజనుల అబివృద్ధి కోసం జరుగుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ అఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు, డాక్టర్ నగేష్ ఎం, బయో టెక్నాలజీ హెడ్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి - కురుపాం

మొక్కజొన్న సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని శ్రీకర్ సీడ్స్ సంస్థ మేనేజర్ వెంకటరమణ అన్నారు. బుధవారం కిచ్చాడ గ్రామంలో రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న ఎకరాకు 45 క్వింటాలు దిగుబడి వస్తుందన్నారు. తెగుళ్లు, చీడపీడ పురుగులు, నీటి ఎద్దడి తట్టుకునే గుణం ఉంటుందని చెప్పారు. రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంటలు వేయాలని సూచించారు . అనంతరం శ్రీకర్ సీడ్స్ విలాస్ హైబ్రిడ్ మొక్కజొన్నపై రైతు క్షేత్ర పదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం పట్టణంలో 30వ వార్డు మాజీ కౌన్సిలర్ తెంటు సత్యనారాయణ బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉదయం తన ఇంటి వద్ద మరణించారు. 1999- 2004, 2014-2019 మధ్య కాలంలో ఆయన కౌన్సిలర్‌గా ఉన్నారు. ఆయన భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు టిడిపి జెండా కప్పి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోలా బాబు, గుంట్రెడ్డి రవికుమార్, కోరాడ నారాయణరావు, రాజశేఖర్ తదితరులున్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 29, 30 తేదీలలో జైపూర్ (రాజస్థాన్)లో విభిన్న ప్రతిభావంతులకు 12వ పార వాలీబాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా నుండి విభిన్న ప్రతిభావంతులైన యనమల రామయమ్మ, మీసాల ఆదిలక్ష్మి, చుక్క కన్నతల్లి, పట్నాల రాధ, మురళి, శ్రీను వెళ్తున్నారు. వీరికి రవాణా ఖర్చులకు జెడ్‌పిచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు.

తాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని కాసిందొరవలస పంచాయతీ పరిధిలో మోసురు వలస గిరిజనులు ఉప సర్పంచ్ జె.ఆదయ్య ఆధ్వర్యంలో బుధవారం తమకు తాగునీరు అందివ్వాలని ఎంపిడిఒ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదయ్య మాట్లాడుతూ తమకు అందాల్సిన నీటిని పాచిపెంట మండలం నుండి తమ గ్రామానికి వలస వచ్చిన గిరిజనులకు సరఫరా చేయడం వల్ల తమకు నీటి కొరత ఏర్పడుతుందన్నారు. తమకు కాకుండా వలస వచ్చిన వారికి నీరివ్వడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిని కొనసాగించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పేదలకు వైద్య సేవలందిస్తున్న ఘోషాసుపత్రిని కొనసాగించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. ఘోషాసుపత్రిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఘోషాసుపత్రిని మూసివేయడం బాధాకరమన్నారు. భవనం పాడైపోవడం వల్ల రోగులు సక్రమంగా రావడం లేదని, భవనం బాగు చేసి ఆసుపత్రిని కొనసాగించేలా చూడాలని డిమాండ్ చేశారు.

నాసిరకం రోడ్డు పనులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంబటిసత్రం రోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, వెంటనే ఆ పనులను పరిశీలించాలని వైసిపి పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముద్దాడ మధు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు యాదవ్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ప్రజాధనంతో జరుగుతున్న రోడ్డు పనులు అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వలన నాణ్యత పూర్తిగా కొరవడిందని, ఇప్పటివరకు కనీసం వాటర్ క్యూరింగ్ కూడా చేయలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందువలన అధికారులందరూ వీటిపై దృష్టి పెట్టకపోవడంతో పనులు నిర్లక్ష్యంగా, నాణ్యత లేకుండా జరుగుతున్నాయని తెలిపారు.

వికలాంగుల సహాయకులకు సత్కారం

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే నిర్వహిస్తున్న సహిత క్లబ్ ద్వారా వికలాంగ విద్యార్థులకు సహాయకులుగా ఉన్న విద్యార్థులను బుధవారం సత్కరించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్రోత్సహించడం, ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటికి తీసుకురావటంలో, చదువులో సందేహాలను నివృత్తిలో, ఎఫ్ఎ, ఎస్ఎ పరీక్షలు రాయటంలో సహాయకులుగా పనిచేసిన సాధారణ విద్యార్థులు హరిప్రియ, గీతిక, కుసుమ ప్రియ, దామని, తులసి, సురేష్, ప్రేమ్ కుమార్, హేమంత్, జస్వంత్, కీర్తన, సందీప్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ హెచ్ఎం టి.లక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థి వీరిలానే సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, త్రినాథ, కేతిరెడ్డి ఈశ్వరరావు, వై.సత్యన్నారాయణ, నారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదైన ఎటిఎం కార్డు మార్చి ఒక వ్యక్తిని మోసగించిన కేసులో నిందితునికి 2 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1500లు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య తీర్పు వెల్లడించినట్లుగా ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలోని ఎటిఎం కేంద్రంలో 2022 జనవరి 24న మధ్యాహ్నం మెంటాడ మండలం జయతి గ్రామానికి చెందిన తాత్రాజు మల్లిస్వామి (ఫిర్యాది) నగదు విత్‌డ్రా చేయడానికి వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తి సహాయం తీసుకోగా, సదరు వ్యక్తి ఫిర్యాది చెప్పిన పిన్ నంబరును గుర్తు పెట్టుకొని, నగదు విత్ డ్రా చేసిన తరువాత ఫిర్యాదికి అసలు ఎటిఎం కార్డుకు బదులుగా వేరే ఎటిఎం కార్డు ఇచ్చి, అక్కడ నుండి వెళ్ళిపోయాడు. అనంతరం, నిందితుడు వేరు వేరు ఎటిఎం కేంద్రాల్లో ఐదు విడతలుగా రూ. 86,750 నగదును ఫిర్యాది బ్యాంకు అకౌంట్ నుండి తీసుకున్నాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మోసానికి పాల్పడిన వ్యక్తిని గుంటూరుకు చెందిన కే. విద్యాసాగర్‌గా పోలీసులు గుర్తించి, అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడిపై నేరారోపణలు రుజువుకావడంతో పై విధంగా తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు.

బీడు వారిన చెరువులు

రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి-పాలకొండ

బీడు వారిన చెరువులను పట్టించుకోకపోతే ఈ వేసవిలో రైతులకు ఇబ్బందులు తప్పవు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మండలంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెలగవాడ నరసింహ చెరువు పూర్తిగా ఎండిపోయి బీడువారింది. దీంతో ఆ చెరువు పరిధిలో ఉన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీరు రెండేళ్లుగా చివరి ప్రాంతమైన వెలగవాడ చెరువుకు అందకపోవడంతో చెరువు మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రబీ పంటకు నీరు అందే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి నీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మొక్కజొన్న కొనుగోలు మరిచిన ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

సాలూరు నియోజకవర్గంలో రైతులు విస్తారంగా సాగుచేసే పంట మొక్కజొన్నని, అలా పంట కొనుగోళ్లను ప్రభుత్వం విస్మరించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. మండలంలో పట్టుచెన్నూరు పంచాయతీ పరిధిలో వెలగవలస, శిఖపరువు, నిమ్మలపాడు, గుజ్జంగివలస, కొత్తూరు గ్రామాల్లో బుధవారం ఆమె ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో రైతులు పండించే పంటల కొనుగోలుకు ఒక విధానం ఉందని కూడా మరిచిపోయారని ఆరోపించారు. సంక్షేమం, అభివృద్ధి కోసం ఎప్పుడు కూడా ఆలోచన చేయలేదన్నారు. ఇటువంటి దుర్మార్గమైన ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే రాష్ట్రాన్ని మర్చిపోవల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.

అనంతరం ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎ.పరమేశ్, బి.తవుడు, కోట లక్ష్మణ, దొర లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు

పట్టణంలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలో బుధవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బెలగాం జూనియర్ కళాశాల మైదానానికి వాకింగ్‌కి వచ్చిన ఉద్యోగులు, మేధావులు, యువత, స్థానికులను కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పోస్టాఫీస్ ప్రాంతంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి అమానవీయం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌చంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అర్చకులపై వైసిపి నేతల దాడి అమానవీయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర అన్నారు. బుధవారం బైపాస్ రోడ్‌లోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలపై దాడులు చేయటం భాగమైందన్నారు. అధికార మదంతో విచక్షణ మరిచి దాడులకు తెగపడటం సరికాదన్నారు. పవిత్రమైన వృత్తిలో ఉన్న అర్చకులపై దాడికి దిగడం వైసిపి నేతల మనోవైకల్యానికి నిదర్శనమన్నారు. టిడిపి వాలంటీర్లకు వ్యతిరేకం కాదని తమ అధినేత ఎప్పుడో స్పష్టం చేశారన్నారు. వైసిపిలా ఊడిగం చేయించుకోబోమని, వారి అర్హతను బట్టి చక్కని జీవితాన్ని ఇస్తామని తెలిపారు.

వైసిపిలోకి లారీ ఓనర్ల సంఘం అధ్యక్షుడు



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి -సాలూరు

పట్టణ లారీ యజమానుల సంఘం అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు బుధవారం వైసిపిలో చేరారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర సమక్షంలో ఆయనకి పార్టీ కండువా కప్పి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు ఆహ్వానించారు. ఆయనతోపాటు సుమారు వంద కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి లో చేరాయి. పట్టణంలో గాని, మండలాల్లో గాని ఎక్కడైనా చోటా నాయకులు వైసిపిలో చేరినా డిప్యూటీ సిఎం రాజన్నదొర స్వయంగా పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానిస్తున్నారు. అయితే ఇక్కడ మాత్రం వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు గొర్లి మధుసూదనరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం గమనార్హం.

ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి విధానాలకు ఆకర్షితులై టిడిపి నాయకులు గొర్లి మధుసూదనరావు వైసిపిలో చేరడం అభినందనీయమని చెప్పారు. పార్టీలో చేరడానికి ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారని, పరిస్థితులను బట్టి చేర్చుకుని పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. కొత్తవారిని పార్టీలో చేర్చుకున్నా సీనియర్ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, వార్డు కౌన్సిలర్ హరి అప్పులకొండ, పట్టణ నాయకులు మద్దిల గోవిందరావు, హరి బాలాజీ, గొర్లి వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్ర దాలినాయుడు పాల్గొన్నారు.

మాజీ చైర్‌పర్సన్ ఎక్కడ?

టిడిపి సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు బుధవారం వైసిపిలో చేరిక సందర్భంగా ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. మధుసూదనరావు వైసిపి లో చేరారు కానీ ఆయన సతీమణి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గొర్లి విజయకుమారి ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ఆమె ఎందుకు వైసిపి కండువా కప్పుకోలేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

గిరిజనులకు అండగా సిపిఎం

ప్రజాశక్తి-కొమరాడ

ఎల్లవేళలా గిరిజనులకు అండగా నిలిచేది సిపిఎం మాత్రమేనని, ఎన్నికల్లో ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలో గిరిజన గ్రామాల్లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాస్తున్నాయని చెప్పారు. అదే సందర్భంలో గిరిజన సమస్యలపై నిత్యం పోరాటాలు సాగిస్తూ, వారి అభివృద్ధికి కృషి చేసింది సిపిఎం మాత్రమేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కుసిమి, తాలడ, శంభం, కిండంగి పంచాయతీలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వి.కళావతి బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కిండంగి గ్రామ పంచాయతీలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, నాయకులు రాము, ఎఎంసి చైర్మన్ మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. బుధవారం మండలంలోని నర్సిపురం ప్రాథమిక పాఠశాల వద్ద ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ భానుమూర్తి పర్యవేక్షణలో ఉచిత వైద్య నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఆయా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, పరికరాలను త్వరలోనే వారికి అందిస్తామని ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు అమ్మన్నరావు, పార్వతీపురం, సీతానగరం ఎంఇఒలు కర్రి ప్రసాదరావు, ఎం.వెంకటరమణ, ఎముకల వైద్య నిపుణులు శేషగిరిరావు, ఫిజియో డాక్టర్లు అజయ్, అఖిల్ పాల్గొన్నారు.

పేరుకుపోతున్న నీటి పన్ను బకాయిలు

20 శాతం దాటని పన్నుల వసూలు ● రూ.5.76 కోట్లకు రూ.1.05 కోట్లే వసూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నీటి పన్ను వసూలు నామ మాత్రంగానే జరుగుతోంది. ప్రతి ఏటా నీటి పన్ను ద్వారా నగర పాలక సంస్థకు రూ.1.76 కోట్లు పనున్నుల రూపంలో వసూలు కావాల్సి ఉంది. గత కొంత కాలంగా కట్టాల్సిన పన్ను బకాయిలు రూ.4.4 కోట్లు వరకు ఉంది. ఈ ఏడాది పన్నుతో కలుపుకొని మొత్తం నగర పాలక సంస్థ కు రావాల్సిన నీటి పన్ను బకాయిలు 5.76 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ఏటా నీటి పన్నుల వసూలులో పురోగతి కనిపించడం లేదు. ఏటా వసూలు కావాల్సిన పన్నులో కేవలం 50 శాతం వరకు మాత్రమే వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మిగిలిన బకాయిలు పేరుకుపోయి ఈ ఏడాది మార్చి నాటికి పాత బకాయి రూ.4.70 కోట్లకు పెరిగింది. పోనీ ఈ ఏడాది అయినా వసూలులో పురోగతి ఉందా అంటే అదీ లేదు. పాత బకాయి రూ.4కోట్లకు గాను కేవలం రూ.29 లక్షలు వసూలు అయ్యింది. ఈ ఏడాది నీటి పన్ను వసూళ్లలో 176 లక్షలకు గాను ఇప్పటి వరకు 76 లక్షలు మాత్రమే వసూలు చేశారు. అంటే పాత బకాయి రూ.4 కోట్లు, ఈ ఏడాది వసూలు ఇంకా వసూలు కావాల్సిన మరో కోటి రూపాయలు, వచ్చే ఏడాదికి పాత బకాయి కింద మరో రూ.4.70 కోట్లకు పన్నుల బకాయి పెరగనుంది. ఈ ఏడాది బకాయితో కలిపి రూ.5.76 కోట్లు వసూలు కావాల్సి ఉండగా దానిలో కేవలం రూ.కోటి 5లక్షలు మాత్రమే వసూలు చేశారు.



మొత్తం కలెక్షన్‌లో 20 శాతం కూడా నీటి పన్ను వసూలుకు నోచుకోలేదు. గతంలో పన్నుల వసూలుకు కేవలం పదుల సంఖ్యలో ఉండే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే వసూలు చేసేవారు. పని భారం ఎక్కువగా ఉండటం కారణంగా పూర్తి స్థాయిలో వసూలు వసూలు చెయ్యలేకపో యేవారు. కానీ వార్డు స్థాయిలో సచివాలయాలు ఏర్పాటైన తరువాత నగరంలో 59 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయంలో రెవెన్యూ విభాగం కార్యదర్శులు కూడా అన్ని సచివాలయాల్లో ఉన్నారు. వారికి కూడా పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత ఉంది. సరిపడా సిబ్బంది ఉన్నా పన్నులు వసూలు కాకపోవడం అధికారులను ఆశ్చర్య పరుస్తోంది. కార్యదర్శులు పన్నులు వసూలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడం, ఇళ్లలో ఎవరూలేని సమయంలో పన్నులు వసూళ్లకు వెళ్లడం వంటి కారణాల వల్ల నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు పదే పదే పన్నుల వసూలుపై హెచ్చరించినా పురోగతి లేదంటే సిబ్బందికి ఉన్న శ్రద్ధ ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. అధికారులు దృష్టి సారించకపోతే నగర పాలక సంస్థకు మరింత నష్టం జరిగి ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ప్రచారాలు చేపట్టినప్పుడు పంపిణీ చేసే కరపత్రాలు అనుమతి ఉన్నది, లేనిది క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దశమంతపురం, సంత నర్సిపురం, నడిమికెళ్ల, నడుకూరు, కంబర, చలివేంద్రి తదితర గ్రామాల సచివాలయాల కార్యదర్శులు, మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి విధిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో విఎస్‌టి టి వెంకట రమణమూర్తి, సీనియర్ సహాయకులు ఎం.నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కంట్రోల్‌రూం ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. కురుపాం నియోజకవర్గంలో ఐదు మండలాలకు సంబంధించి కురుపాం తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 08963-229298 ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురంలో రామ్‌చరణ్ అభిమానులు బుధవారం వసంత కుమార్ హాస్పిటల్ వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా పార్వతీపురంలో మెగా ఫ్యామిలీ సేవా సంఘం అధ్యక్షులు రాజన రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గొర్లి చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరం సుమారు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రామ్‌చరణ్ యువశక్తి ప్రెసిడెంట్ చందు, జనసేన బ్లడ్ డోనార్ గ్రూప్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నాని, ప్రవీణ్, శివ, బాలు, సంతోష్, వంశి, దుర్గా, సాయి, చిన్న, ప్రవీణ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

సుంకిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని సుంకి గ్రామంలో రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి కార్తీక్ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది గుంట్రేడ్డి సురేష్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

నడుకూరులో..

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరలు పాల్గొన్నారు.